

హైదరాబాద్ అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు చెందిన మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై చేసే ప్రసంగానికి వారంతా హాజరయ్యారు. పాల్గొన్న వారిలో డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు , కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ ఉన్నారు.



కలెక్టర్ గౌతమ్‌కు స్వాగతం పలుకుతున్న సెయింట్ జోసెఫ్స్ స్కూల్ విద్యార్థులు

# విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

- పోటీల్లో ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయక ప్రదర్శన ఇవ్వాలి: కలెక్టర్
- సెయింట్ జోసెఫ్స్ స్కూల్లో దక్షిణ భారత స్థాయి పోటీలు ప్రారంభం

ఖమ్మం/ ఖమ్మం సిటీ/ ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 15: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయక ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. దక్షిణ భారత స్థాయి సెయింట్ జోసెఫ్స్ పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవ వేడుకలను ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్.. జ్యోతి ప్రజ్వలిన చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక వికాసంతోపాటు విద్యార్థుల్లో సోదరబావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. అనంతరం 28 పాఠశాలల నుంచి బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన దాదాపు 2000 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సొసైటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రెవరెండ్ వట్టి జపమాల, జిల్లా అధికారులు సోమశేఖరశర్మ, సునీల్‌రెడ్డి, భారతిరాణి, పాఠశాల కరస్పాండెంట్ మరియా సుందరి, హెచ్ఎం నక్షత్రం తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కాగా, ఈ పోటీలు ఈ నెల 17 వరకు జరుగుతాయి.

# పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

- అత్యవసర ఫైళ్ల క్లియరెన్స్‌లో అలసత్వం వహించొద్దు
- గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- పర్యవేక్షకుల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం, డిసెంబర్ 15: కలెక్టరేట్‌లో పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులు, సూపరింటెండెంట్లను ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ఐడీవోసీలో వివిధ విభాగాల సూపరింటెండెంట్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఫైలునూ వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర ఫైళ్ల విషయంలో అలసత్వం చూపకూడదని అన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, సంబంధిత అధికారులను సంప్రదించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అవసరాలకు స్థల కేటాయింపు ఫైళ్లపై వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, పీవోబీ ఎన్‌వోసీలను పరిష్కరించాలని, ధరణి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సెక్షన్ల వారీగా పెండింగ్ ఫైళ్లపై కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు అరుణ, మీనన్, మదన్‌గోపాల్, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'మార్చి 3 నుంచి ఖమ్మంలో కళాకారుల కవాతు'

ఖమ్మం, డిసెంబర్ 15: వచ్చే ఏడాది మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో కళాకారుల కవాతు నిర్వహించనున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభలో భాగంగా కళాకారులు నృత్యం, డప్పు డాన్సు, కోలాటం, గుస్సాడీ, బంజారా, కోయ డాన్సులు, మహిళల కోలాటాలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 3న ఎర్రదుస్తులు ధరించిన 25 వేలమందితో ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

# పామాయిల్ సాగు విస్తరణపై దృష్టి

- ఆయిల్‌పాం సాగుతోనే రైతుల జీవన ప్రమాణాలు మెరుగు
- వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణలో 'తుమ్మల'
- ఐదు పామాయిల్ పరిశ్రమల స్థాపన ఫైళ్లపై తొలి సంతకం



చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆయిల్‌పాం సాగు.. ఆ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. రైతులు ఆయిల్‌పాం సాగువైపు మొగ్గు చూపేందుకు అధికారులు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రిగా హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే తుమ్మల మూడు కీలక దస్త్రాలపై సంతకాలు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.1,050 కోట్లతో ఐదు పామాయిల్ పరిశ్రమలు స్థాపించే ఫైళ్లపై తొలి సంతకం చేశారు. అలాగే, రాష్ట్రంలో 110 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించేలా రూ.4.07 కోట్లతో సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టే పనుల ఫైళ్లపై రెండో సంతకం చేశారు. అదేవిధంగా, సహకార వ్యవస్థలో పారదర్శకమైన పాలన అందించేందుకుగాను వివిధ విభాగాలను పూర్తిగా కంప్యూటరీకరణ చేసేందుకు అవసరమైన చర్యల కోసం మూడో దస్త్రంపై సంతకం చేశారు. రాష్ట్రంలోని సహకార కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీతో పాటు జిల్లా సహకార కార్యాలయాల్లో అన్ని రకాల కార్యకలాపాలను కంప్యూటరీకరించాలని అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఏడాదికి ఒకటి చొప్పున పామాయిల్ పరిశ్రమలను ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నెలకొల్పుతామని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోకుండా తెగుళ్ల దాడుల ప్రమాదాలను తగ్గించడం వంటివి పామాయిల్ సాగులోనే సాధ్యమవుతాయని అన్నారు. 25 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడినిచ్చే దీర్ఘకాలిక పంటగా రైతుకు స్థిరమైన ఆదాయం ఇస్తుందన్నారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగుతో రైతులు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఇంకా అంతరపంటలతో అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. ఆయిల్‌ఫెడ్ 2023-24 నుంచి ఏటా 40 వేల ఎకరాల విస్తీర్ణం పెంచేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

# 'తొలిమెట్టు' ద్వారా ఉత్తమ ఫలితాలు

- ప్రతి విద్యార్థికీ కనీస విద్యా ప్రమాణాలు అందించాలి
- కలెక్టర్ల వీసీలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ





విద్యాశాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక

ఖమ్మం/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 15: 'తొలిమెట్టు' ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. 'తొలిమెట్టు', 'ఉన్నతి', 'లక్ష్య' కార్యక్రమాల అమలుపై విద్యాశాఖ పాఠశాల విద్య సంచాలకులు దేవసేన, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాథమిక దశలో 75 శాతం మంది విద్యార్థులకు పూర్తిస్థాయి విద్యా ప్రమాణాలు ఉండడం లేదని అన్నారు. దానిని సాధించేందుకే నిరుడు తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి ఏడాది మంచి ఫలితాలు వచ్చాయని, అందుకని దీన్ని కొనసాగిస్తూ మరింత మెరుగైన ఫలితాల సాధన దిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీసీలో ఖమ్మం నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్, డీఈవో సోమశేఖరశర్మ, ఆర్ఎంవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం నుంచి కలెక్టర్ ప్రియాంక, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఏఎంవో నాగరాజశేఖర్ పాల్గొన్నారు.

# సంబురంగా గిరిజన క్రీడా పోటీలు

## కిన్నెరసాని క్రీడా పాఠశాలలో రెండోరోజు 621 మంది హాజరు



వాలీబాల్ బాలికల విజేత కాచనపల్లి జట్టుతో అధికారులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 15: ఐటీడీఏ ఆధ్వర్యంలో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో గిరిజన విద్యార్థుల క్రీడా పోటీలు సంబురంగా జరుగుతున్నాయి. మూడురోజులపాటు జరిగే ఈ పోటీల్లో రెండోరోజు శుక్రవారం ఏడు డివిజన్ల నుంచి 621 మంది బాలికలు హాజరయ్యారు. ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మొదటిరోజు గురువారం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ హాజరై క్రీడాపోటీలను వీక్షించి విజేతలకు బహుమతులు అందించారు. రెండోరోజు డీడీ మణెమ్మతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత బాలికలు క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. ఆయా పోటీల్లో పలువురు విద్యార్థులు మెరుగైన స్థానాలు సాధించారు. అధికారులు చంద్రమోహన్, నరసింహారావు, రూపాదేవి, జహీరుద్దీన్, తిరుమలరావు, రమణయ్య, గోపాల్‌రావు, చందు, వెంకట్‌నారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, వీరూనాయక్, వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, హరికృష్ణ, కే.వెంకటేశ్వర్లు, నాగులు, తారాచంద్, కృష్ణ, చలపతిరావు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న వైరా, పాల్వంచ బాలికలు

## నేషనల్ వాలీబాల్ పోటీలకు ఖమ్మం విద్యార్థిని



అంబిక

ఖమ్మం సిటీ, డిసెంబర్ 15: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ వాలీబాల్ పోటీలకు ఖమ్మం ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థిని బీ.అంబిక ఎంపికైంది. ఈ నెల 20 నుంచి 23 వరకు తమిళనాడులో జరుగనున్న పోటీల్లో ఆమె పాల్గొననుంది. శనివారం నుంచి మహబూబ్‌నగర్‌లో స్టేట్‌మీట్ నిర్వహించనుండగా, ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన అంబిక పాల్గొననుంది. ఆమె కొంతకాలంగా ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో కోచ్ ఎండీ అబర్‌అలీ సమక్షంలో శిక్షణ పొందుతోంది. జాతీయ పోటీల్లో పాల్గొనబోతున్న అంబికను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తదితరులు అభినందించారు.